క్లుప్తంగా

సారా రహిత గ్రామంగా చినకుదమ..

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని చినకుదమ గ్రామంగా సారా రహిత గ్రామంగా ఎక్సైజ్ అధికారులు ప్రకటించారు. నవోదయం 2.ఓ కార్యక్రమంలో భాగంగా సారా తయారీ, విక్రయాలు, తాగడం వల్ల కలిగే అనర్థాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఇలా కొన్నిరోజులకు గ్రామంలో సారా తయారీ, విక్రయాలు జరగకపోవడంతో సారా రహిత గ్రామంగా ప్రకటించినట్లు ఎక్సైజ్ అధికారి పి.శ్రీనివాసరావు తెలిపారు.

పారిశుధ్యంపై అవగాహన



గ్రామంలో పారిశుధ్య పరిస్థితులను పరిశీలిస్తున్న అధికారులు

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని పెద బుడ్డిడి గ్రామంలో పారిశుధ్యంపై గురువారం అవగాహన కల్పించారు. ఎంపీడీవో కె.ధర్మారావు, మండల ప్రత్యేకాధికారి టి.కొండలరావులు గ్రామంలో పర్యటించి, చెత్త సేకరణ, చెత్త ద్వారా ఎరువుల తయారీపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. గుడి, బడి పరిసరాల్లో చెత్తాచెదారం లేకుండా చేయాలన్నారు. వర్షపు నీటి నిల్వల కోసం గుంతలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్.భవన్‌మోహన్‌రావు, రామ్మూర్తినాయుడు తదితరులు పాల్గొన్నారు.



గుమ్మలక్ష్మీపురం: చెత్త సేకరణను పరిశీలిస్తున్న ఎంపీడీవో త్రివిక్రమరావు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని పి.ఆమిటి గ్రామంలో పారిశుధ్యం నిర్వహణ, చెత్త సేకరణపై ఎంపీడీవో త్రివిక్రమరావు గ్రీన్ అంబాసిడర్లకు గురువారం అవగాహన కల్పించారు. ప్రతిరోజూ ఇంటింటి నుంచి సేకరించిన చెత్తను చెత్త సంపద తయారీ కేంద్రానికి తరలించాలని తెలిపారు. అలా తరలించిన చెత్త నుంచి ఎరువు తయారు చేసి సబ్సిడీపై రైతులకు అందజేయాలన్నారు.

వాహనాలను అజాగ్రత్తగా నడపొద్దు



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ అనీష్

జియ్యమ్మవలస: వాహనాలను అజాగ్రత్తగా నడపవద్దని చినమేరంగి ఎస్ఐ అనీష్ సూచించారు. మండలంలోని పెదమేరంగి కూడలి వద్ద వాహనాలు నడిపేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వాహనదారులకు గురువారం అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనాలపై ఇద్దరి కన్నా ఎక్కువ మంది ప్రయాణించరాదని, పరిమిత వేగంతో వాహనాలు నడపాలని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ, మద్యం తాగి వాహనాలు నడపవద్దన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో పోషకాలు

బలిజిపేట: ప్రకృతి వ్యవసాయంలో భాగంగా ప్రీమాన్సూన్ డ్రై షోయింగ్(పీఎండీఎస్)వలన ప్రధాన పంటకు అవసరమైన సూక్ష్మ, స్థూల పోషకాలు భూమికి లభిస్తాయని ఎంసీఆర్‌పీ లక్ష్మి, తిరుపతిరావు రైతులకు అవగాహన కల్పించారు. బర్లి రైతు సేవా కేంద్రంలో బర్లి, మిర్తివలస రైతులకు వ్యవసాయ సాగుపై గురువారం అవగాహన కల్పించి కిట్లు పంపిణీ చేశారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

పార్వతీపురం రూరల్: జిల్లా కేంద్రం శివారులో ఓ ప్రైవేట్ పాఠశాల సమీపంలో ఆగి వున్న ఆటోను వెనుక నుంచి వస్తున్న మరో ఆటో ఢీకొట్టడంతో ఆటోలో ఉన్న ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. బలంగా వెనుక నుంచి ఢీకొట్టడంతో ఆటో పల్టీలు కొట్టి రోడ్డు పక్కన ఉన్న తుప్పల్లో పడింది. సినీ పక్కీలో జరిగిన ఈ ప్రమాదం స్థానికులను భయాందోళనకు గురిచేసినప్పటికీ త్రుటిలో ప్రమాదం తప్పి స్వల్ప గాయాలతో ప్రయాణికులు బయట పడ్డారు.

ఎరువుల పంపిణీ

సీతానగరం: ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయానికి అవసరమైన ఎరువులు రైతు సేవా కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్నట్టు ఏవో ఎస్.అవినాష్ అన్నారు. లచ్చయ్యపేట, పెదబోగిలి, నిడగల్లు రైతు సేవా కేంద్రాల్లో గురువారం సిబ్బంది సహకారంతో డీఏపీ, యూరియా, కాంప్లెక్స్ ఎరువులను రైతులకు పంపిణీ చేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. మండలంలోని ఖరీఫ్ సీజనులో వరి, చెరకు, పామాయిల్, పత్తి సాగు భూములకు అవసరమైన వివిధ రకాల ఎరువులు అన్ని గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని అన్నారు.

గొర్రెల్లో కాలిపుండు వ్యాధితో..

తస్మాత్..!

- వర్షాకాలంలో విజృంభించనున్న సమస్యలు
- జాగ్రత్తలపై దృష్టి పెట్టాలంటున్న పశు వైద్యులు



వర్షాలతో తడిచిన ప్రదేశంలో మేతలో నిమగ్నమైన గొర్రెల మందలు

పాలకొండ రూరల్: సీజనల్ వ్యాధులు పాడి రైతులను అవస్థలకు గురి చేస్తాయని, అప్రమత్తంగా ఉండాలని పశు వైద్యులు సూచిస్తున్నారు. ప్రస్తుత వర్షాకాలంలో గొర్రెల్లో కాలిపుండు వ్యాధి వ్యాప్తి చెందే ప్రమాదం అధికమని పేర్కొంటున్నారు. బహిరంగ ప్రదేశాల్లో మేతకు వెళ్లే గొర్రెల మందలు వర్షాల్లో తడవటం, మురికి కుంటల్లో, నిల్వ ఉన్న నీటిలో అధిక సమయం ఉండటం వలన వాటి కాళ్లు అధిక సమయం తడవటం, చిత్తడి, బురదతో కూడిన నేలల్లో తిరగటం వలన ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుదని హెచ్చరిస్తున్నారు. పాడి రైతులు ముందుగా గుర్తించకుంటే ఒక్క దానికి వచ్చిన వ్యాధి త్వరగా మందలో మిగిలిన వాటికి వ్యాపిస్తుందన్నారు.

వ్యాధి లక్షణాలు ఇలా...

ఈ వ్యాధి సోకిన గొర్రెలు తొలిత మిగిలిన వాటి కంటే నడకలో వెనుకపడతాయి. సరిగా నడవలేక ఇబ్బందులు పడతాయి. అలాంటప్పుడు వాటి గిట్టలను పరిశీలించాలి. గిట్టల మధ్య ఎర్రగా కందినట్టు ఉంటే కాలిపుండు వచ్చినట్టు గుర్తించాలి. ఈ వ్యాధి సోకిన జీవాలు సరిగా మేత మేయవు, బరువు తగ్గుతాయి. గిట్టల మధ్య ఎర్రగా కందిన భాగం ఉబ్బి చీము పడుతుంది. అలాగే తీవ్రమైన చెడు వాసన వస్తుంది. వ్యాధి తీవ్రతను బట్టి గిట్టలు ఊడిపోయే ప్రమాదం ఉంది. ఈ తరహా లక్షణాలు గొర్రెల్లో గుర్తిస్తే తక్షణమే స్పందించాలి. వ్యాధి సోకిన గొర్రె గిట్టలను 10శాతం మైలతుతమ్ము ద్రావణంతోగాని, 10 శాతం జింకు సల్ఫేట్ ద్రావణంతో లేక 5 శాతం ఫార్మలిన్ ద్రావణంతో శుభ్రం చేయాలి. ఇలా రోజుకు రెండు సార్లు చేయటం వలన ఫలితం ఉంటుంది. వైద్యుల సూచనల మేరకు యాంటీబయాటిక్ మందులను నెల రోజులు వాడుకోవాలి. ఈ వ్యాధి వ్యాప్తి చెందకుండా ఉండాలంటే వ్యాధి సోకిన జీవాలను మంద నుంచి వేరు చేయాలి. మందలను చిత్తడి, నీరు నిలిచే నేలలకు దూరంగా ఉంచాలి. జీవాలను పెంచే ప్రదేశాలల్లో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి. వైద్యుల సూచనల మేరకు ఎప్పటికప్పుడు అవసరమగు సీజనల్ మందులు వేయాలి.

నియోజకవర్గంలోని మండలాల వారీగా గొర్రెలు

మండలం పేరు	గొర్రెల సంఖ్య
పాలకొండ	21,841
వీరఘట్టం	27,654
సీతంపేట	7,959
భామిని	9,957

ముందస్తు జాగ్రత్తలు అవసరం

ప్రస్తుత సీజన్‌లో పాడి సంపద రోగాల బారిన పడే వకాశాలు అధికం. వర్షాల కారణంగా తడిచిన నేలలో అధిక సమయం జీవాలు గడపటం వలన రోగాలు వస్తాయి. ఇప్పటికే గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. ఉచిత మందులు, టీకాలు వేస్తున్నారు. కాలి పుండును అధిగమించేందుకు జాగ్రత్తలు అవసరమని గుర్తించాలి. వైద్యుల సూచనలు పాటించటం వలన ఫలితం మెరుగ్గా ఉంటుంది.

– సిద్ధార్థకుమార్, పశువైద్యాధికారి, పాలకొండ

వైఎస్సార్ సీపీ జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి హాజరుకావాలి



వైఎస్సార్ సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు

జియ్యమ్మవలస రూరల్: పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలోని రాయల్ కన్వెన్షన్ హాల్‌లో ఈ నెల 5వ తేదీన వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం జరగనుందని, ఈ సమావేశానికి పార్టీ శ్రేణులంతా హాజరుకావాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు ఓ ప్రకటనలో గురువారం కోరారు. వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఉదయం 10 గంటలకు ఈ సమావేశం జరుగుతుందని, పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులంతా పెద్దఎత్తున రావాలని కోరారు.

గుమ్మలక్ష్మీపురం: పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలోని రాయల్ కన్వెన్షన్ హాల్‌లో ఈ నెల 5వ తేదీన జరిగే వైఎస్సార్ సీపీ జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి పార్టీ శ్రేణులంతా హాజరుకావాలని గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల కన్వీనర్లు కుంబురుక దీనమయ్య, ఇంటికుప్పల గౌరీశంకరరావులు వేర్వేరు ప్రకటనలో గురువారం కోరారు. పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి అన్ని మండలాల నుంచి పార్టీ పదవులు అనుభవిస్తున్న వారితో పాటు కార్యకర్తలు, అభిమానులు కూడా రావాలన్నారు. ఈ సమావేశానికి శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, పార్టీ రీజనల్ కో–ఆర్డినేటర్ కురసాల కన్నబాబు, మాజీ ఎమ్మెల్యేలు తదితరులంతా వస్తారన్నారు.

● పరామర్శ



మిత్రో పంతులు కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం పుష్పశ్రీవాణి

గుమ్మలక్ష్మీపురం(కురుపాం):

కురుపాం మండలంలో ఇటీవల మృతి చెందిన పలువురి కుటుంబాలను మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి గురువారం కలిసి పరామర్శించారు. పి.లేవిడి గ్రామానికి చెందిన పత్తిక మోహన్‌దాసు, బొడ్డమానుగూడకు చెందిన జెస్సీకా, సునంద, వెంపటాపురానికి చెందిన పిత్రో తండ్రి, మొండెంఖల్లు గ్రామానికి చెందిన బాలకృష్ణ మిత్రో(బాలు బాబు) పంతులు, నీలకంఠాపురానికి చెందిన లక్ష్మి కొడుకు, గొటివాడకు చెందిన టి.శ్రీనివాసరావు మరణించగా, ఆయా కుటుంబాలను ఆమె కలిసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుల ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని వేడుకున్నారు. ఆమె వెంట కురుపాం, గుమ్మలక్ష్మీపురం ఎంపీపీలు శెట్టి పద్మావతి, కుంబురుక దీనమయ్య, కురుపాం మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ ఇంటికుప్పల గౌరీశంకరరావు, వైస్ ఎంపీపీ రంగారావు, మాజీ ఏఎంసీ చైర్మన్ నిమ్మక వెంకటరావు, ఎంపీటీసీ జి.విద్యారాణి, మాజీ ఎంపీపీ అనిమి ఇందిరా కుమారి, పార్టీ నాయకులు రేవు సత్తిబాబు, ఐ.రామకృష్ణ తదితరులు ఉన్నారు.

జియ్యమ్మవలస రూరల్: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జ్వరంతో బాధపడుతూ చికిత్స పొందుతున్న మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థి తోయక కరుణాకర్‌ను గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు కూరంగి సీతారాం పరామర్శించారు. విద్యార్థుల చదువుతో పాటు ఆరోగ్యం కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలని పాఠశాలల యాజమాన్యాలను ఆయన కోరారు.

50 శాతం రాయితీపై పశుదాణా



పశుదాణా అందజేస్తున్న సర్పంచ్ గౌరీశంకరరావు, పశువైద్యాధికారి లక్ష్మణరావు

గుమ్మలక్ష్మీపురం: స్థానిక రైతు సేవా కేంద్రం వద్ద పాడిరైతులకు గురువారం పశుదాణా పంపిణీ చేశారు. సర్పంచ్ బొత్తాడ గౌరీశంకరరావు, పశువైద్యాధికారి పి.లక్ష్మణరావుల చేతులమీదుగా వీటిని 50 శాతం రాయితీపై అందజేశారు. మొదటి విడత కింద పంపిణీకి మొత్తం 4 వేల కిలోల దాణా తీసుకువచ్చామని, తెల్లరేషన్‌కార్డు కలిగిన ప్రతి రైతుకు 50 కిలోల దాణాను రూ.555లకే అందజేయడం జరుగుతుందని పశువైద్యాధికారి తెలిపారు.

కొనసాగుతున్న రేషన్ కష్టాలు

భామిని మండలంలో రేషన్‌కార్డుదారుల కష్టాలు కొనసాగుతున్నాయి. రేషన్ కోసం లబ్ధిదారులు డిపోల వద్ద పెద్ద సంఖ్యలో క్యూ కట్టారు. మండలంలోని నేరడిలో రేషన్ కోసం కార్డుదారులు గురువారం ఇలా క్యూ కట్టారు. దీనికి తోడు సిగ్నల్స్ లేక అవస్థలు పడ్డారు. - భామిని



రామ, బలరామ అవతారంలో జగన్నాథుడు



రామ బలరామ అవతారంలో జగన్నాథస్వామి

పాలకొండ: రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా గురువారం జగన్నాథస్వామి రామ, బలరామ అవతారంలో భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం నుంచి తిరుగు రథయాత్ర నిర్వహించేందుకు దేవదాయ శాఖ అధికారులు ఏర్పాట్లు చేపడుతున్నారు. మారు దశమి సందర్భంగా తిరుగు రథయాత్రకు లక్షల సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ఆ మేరకు ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి సూర్యనారాయణ తెలిపారు.

పరుశరామ అవతారంలో జగన్నాదుడు

బామిని: బత్తిలిలో వెలసిన జగన్నాదుడు గురువారం పరుశరాముని అలంకరణలో అలరించాడు. రథయాత్రలో దశవతారాలులో దర్శనమివ్వడం ఆనవాయితీ. పూరి నుంచి తెచ్చిన దశవతారాలు అలంకరణతో బక్తులకు దర్శనమిచ్చారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

వీరఘట్టం: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్.ఐ జి.కళాధర్ సూచించారు. స్థానిక కొత్త బస్టాండ్‌లో సైబర్ నేరాలపై ప్రజలకు గురువారం అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తులు పంపించే వాట్సాప్ లింక్‌లు ఓపెన్ చేయవద్దని, బ్యాంకు సిబ్బంది అంటూ ఎవరైనా ఫోన్ చేస్తే స్పందించొద్దని సూచించారు. ఇటీవల జరిగిన పలు సైబర్ మోసాలను ఆయన వివరించారు.

రాయితీ విత్తనాల పంపిణీ



విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

సీతంపేట: వంద శాతం రాయితీపై పంపిణీ చేస్తున్న కంది, వరి విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. మండలంలోని కుసిమి రైతు సేవా కేంద్రంలో గురువారం విత్తనాలు పంపిణీ చేశారు. మండలానికి కందులు, రాగులు 8 క్వింటాళ్ల చొప్పున వ్యవసాయ శాఖ కేటాయించిందన్నారు. సంబంధిత శాఖ సిబ్బంది ఎప్పటికప్పుడు ఈ పంటలపై సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సంధ్యారాణి, వ్యవసాయాధికారి వాహిణి పాల్గొన్నారు.

20 లీటర్ల సారా స్వాధీనం



పట్టుబడిన సారాతో ఎక్సైజ్ సిబ్బంది

జియ్యమ్మవలస: మండలంలోని గడ సింగుపురంలో ఎక్సైజ్ సిబ్బంది గురువారం చేపట్టిన ఆకస్మిక తనిఖీల్లో 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలో సారా విక్రయాలు జరుగుతున్నట్లు అందిన సమాచారం మేరకు సోదాలు చేయగా సారా పట్టుబడిందని ఎక్సైజ్ సీఐ పి.శ్రీనివాసరావు తెలిపారు. సారా విక్రయిస్తున్న వ్యక్తితో పాటు ఆ వ్యక్తికి సారా సరఫరా చేసే వ్యక్తిపై కూడా కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ప్రజారోగ్యానికి ప్రాధాన్యమివ్వండి



సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న మండల ప్రత్యేకాధికారి కొండలరావు

జియ్యమ్మవలస రూరల్: ప్రజారోగ్యానికి ప్రాధాన్యమిచ్చి, పారిశుధ్య కార్యక్రమాలు సక్రమంగా అమలు చేయాలని మండల ప్రత్యేకాధికారి టి.కొండలరావు సూచించారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కె.ధర్మారావు అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో గురువారం సమావేశం నిర్వహించారు. వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారన్న అంశంపై సమీక్ష చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి పంచాయతీలోనూ పారిశుధ్య పనులు పక్కాగా జరగాలని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ శానిటరీ సెక్రటరీలను ఆదేశించారు. అలాగే ఇళ్ల నిర్మాణాల పూర్తికి చర్యలు చేపట్టాలన్నారు. ఈ నెల 15వ తేదీలోగా లబ్ధిదారులతో గృహ నిర్మాణాలు పూర్తి చేయకుంటే సంబంధిత సచివాలయ సిబ్బందిపై చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు.

కొన్ని మండలాల్లోని అధికారులు, సిబ్బంది విధుల నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తున్నారని, ఇది సరికాదని మండిపడ్డారు. అందరూ బాగా పని చేసి మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏఈ శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కాటన్ సంచులే మేలు



కాటన్ సంచులు పంపిణీ చేస్తున్న తహసీల్దారు జయ

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): నిషేధిత పాలిథిన్ కవర్లు వాడకుండా కాటన్ సంచులే వినియోగించాలని కురుపాం తహసీల్దారు జయ సూచించారు. కురుపాం మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయం వద్ద కార్యాలయ సిబ్బందితో పాటు అక్కడకు వచ్చిన పలువురికి కాటన్ సంచులు గురువారం పంపిణీ చేశారు. ప్రతిఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని, పాలిథిన్ కవర్ల వినియోగానికి స్వస్తి పలకాలని తహసీల్దారు పిలుపునిచ్చారు. యస్ సొసైటీ సహకారంతో అందజేస్తున్న ఈ కాటన్ సంచులను వినియోగించి, పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలన్నారు. బియ్యాలవలస, రస్తాకుంటుబాయి, గొటివాడ పంచాయతీల్లో నిషేధిత పాలిథిన్, ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలపై ప్రజలను చైతన్యం చేస్తున్నామని సొసైటీ కార్యదర్శి ఎస్.కె గౌస్ తెలిపారు. కార్యక్రమంలో బియ్యాలవలస మాజీ సర్పంచ్ పువ్వల పత్తి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల నమోదు పెంచాలి

గరుగుబిల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచేందుకు కృషి చేయాలని ఎంఈవో1 సామల సింహాచలం సూచించారు. మండలంలోని గిజబ, నాగూరు గ్రామాల్లోని ప్రభుత్వ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలను గురువారం సందర్శించిన ఆయన.. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు, నమోదులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం, అర్థమయ్యే రీతిలో విద్యాబోధన అందివ్వాలన్నారు. పాఠశాల ఆవరణలో కిచెన్ గార్డెన్ ఉండేలా చూడాలన్నారు.

మలేరియా, డెంగీ వ్యాధులపై తస్మాత్..



మాట్లాడుతున్న ఎంపీడీవో మిశ్రో

సీతంపేట: మలేరియా, డెంగీ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో బిబి.మిశ్రో అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో భామిని, సీతంపేట, వీరఘట్టం, పాలకొండ పరిధిలోని పీహెచ్‌సీల హెల్త్ సూపర్‌వైజర్లు, ల్యాబ్ టెక్నీషియన్‌లతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. ఎక్కడైనా మలేరియా పాజిటివ్ కేసులు వస్తే ఆ పరిసర ప్రాంతాల ప్రజలకు రక్తపరీక్షలు చేయాలన్నారు. స్ప్రేయింగ్ చేయించాలన్నారు. అందుబాటులో మందులు ఉంచుకోవాలన్నారు. క్షేత్ర స్థాయిలో డెంగా మాసోత్సవ ర్యాలీలు చేయాలన్నారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ జె.మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు



రామా కళామందిర్ కూడలి వద్ద సీసీ కెమెరా ఏర్పాటు చేయిస్తున్న ఎస్ఐ

పాలకొండ రూరల్: పట్టణంలో ఆకతాయిల ఆట కట్టించేందుకు, అనుమానితులపై నిఘా సారించేందుకు పోలీసులు నడుం బిగించారు. ఇందులో భాగంగా ఇటీవల సుడా చైర్మన్ కె.రవికుమార్ అందించిన సీసీ కెమెరాలను వివిధ కూడళ్ల వద్ద ఏర్పాటు చేయిస్తున్నారు.

ఎస్ఐ కె.ప్రయోగమూర్తి నేతృత్వంలో సిబ్బంది పట్టణంలోని ముఖ్య కూడళ్లు, వ్యాపార సముదాయ ప్రాంతాలు, ఆధ్యాత్మిక ప్రదేశాలతో పాటు పాఠశాలలు, కళాశాలలు, కాలనీలు, సినిమా థియేటర్లు, ఆర్టీసీ కాంప్లెక్స్ తదితర ప్రాంతాల్లో గురువారం ఏర్పాటు చేశారు. 20 వార్డుల పరిధిలో 80 వరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. వ్యాపారులు తమ దుకాణాల వద్ద కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వీటి పనితీరు మొత్తం క్రైమ్ విభాగంతో అనుసంధానం చేస్తున్నామన్నారు. 24 గంటలూ పర్యవేక్షిస్తామన్నారు.

మహిళా సర్పంచ్‌లకు శిక్షణ

సీతంపేట: స్థానిక వైటీసీలో మహిళా సాధికారిత, స్వపరిపాలనపై పాలకొండ, ఎల్ఎన్‌పేట, పాతపట్నం మండలాలకు చెందిన మహిళా సర్పంచ్‌లకు గురువారం శిక్షణ ప్రారంభమైనట్టు ఎంపీడీవో మిశ్రో తెలిపారు. గ్రామ స్థాయిలో విధులు, బాధ్యతలు ఎలా నిర్వర్తించాలో వివరించారు. కార్యక్రమంలో డీపీఆర్‌సీ లోకనాథం, ఎంవోటీ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గరుగుబిల్లి: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గరుగుబిల్లి, గొట్టివలస, బీవీపురం, గొల్లవానివలస, దళాయివలస, పెద్దూరు, కొత్తపల్లి తదితర గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతున్నట్లు ఆ శాఖ ఏఈ బి.శ్రీనివాసనాయుడు ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. విద్యుత్ లైన్ల అనుసంధాన పనుల దృష్ట్యా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ అసౌకర్యం కలుగుతుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.